క్లుప్తంగా

విరాళాల సేకరణ

సీతానగరం: కేరళ వరద బాధితుల ఆర్థిక సహాయార్థం ఏపీ రైతు సంఘం నాయకులు విరాళాలు సేకరిస్తున్నారు. ఈమేరకు కాశీపేటలో ఆదివారం 5,180 రూపాయల విరాళం సేకరించారు. కార్యక్రమంలో గవర వెంకటరమణ, ఆర్.రాము, పి. చిన్నారావు, వై. రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ లిస్ట్ తయారు చేయాలి



మాట్లాడుతున్న యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయి ప్రసాద్

పార్వతీపురం టౌన్ : ఉద్యోగులను బదిలీ చేసే ముందు సీనియార్టీ లిస్ట్ తయారు చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జిల్లా గ్రామ, వార్డు సచివాలయం ఆరోగ్య కార్యకర్తల సమావేశం బి. రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఎన్‌ఎంలకు అవసరం లేని సేవలను మినహాయించాలన్నారు. అలాగే సిబ్బందికి యూనిఫారం, ఎలివేషన్ కిట్లు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి, సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. వేణు, సీఐటీ యూ జిల్లా నాయకుడు బి. సూరిబాబు, వివిధ మండలాల సచివాలయ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

బొబ్బిలి: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం స్థానిక పట్టణంలో విరాళాల సేకరణ ఆదివారం చేపట్టారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, పి.ఈశ్వరరావు, చుక్క సన్యాసిరావు, రాంబార్కి తిరుపతిరావు, కూర్మినాయుడు, అప్పారావు, శంకరరావు కలిసి దాతలు ఇచ్చిన సొమ్మును పోగుచేయగా రూ.5 వేలు సమకూరిందన్నారు. ఈ నగదును కలెక్టర్ అంబేడ్కర్ చేతులమీదుగా కేరళ పంపించనున్నట్లు తెలిపారు.

రక్తదానంపై అపోహలు తగవు

రాజాం సిటీ: రక్తదానంపై నెలకొన్న అపోహలు విడనాడాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో సినీహీరో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువతీ,యువకులంతా ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని తెలిపారు. రక్తదానం చేస్తే సన్నబడిపోతాం, ఆరోగ్యం క్షీణిస్తుందన్న వాటిని నమ్మవద్దన్నారు. రక్తం దానం చేస్తే ఆరోగ్యమే తప్ప అనర్థం లేదన్నారు. 18 ఏళ్లు నిండిన యువకులు రక్తదానానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, చిరంజీవి అభిమానులు గోక కొండలరావు, కె.జనార్దన, బి.రమణ, వి.శ్రీనివాసరావు, జగదీష్, త్రినాద్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూ చించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించా రు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తక పఠనం ప్రయోజనాలు, పుస్తకాలు ఎలా చదవాలో లైబ్రేరియన్ తెలిపారు. పుస్తక పఠనంతో పాటు చి త్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నప్పుడు పాటించాల్సిన మెలకులను ఆయన నేర్పించారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకుంటే అపారమైన జ్ఞానం లభిస్తుందన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని, ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్యరక్షణ తప్పనిసరి

రేగిడి: మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని బూరాడ, తోకలవలస, లక్ష్మణవలస తదితర గ్రామాల్లో పండిస్తున్న మొక్కజొన్న పంటను ఆయన ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం పంటను కత్తెర పురుగు ఆశిస్తోందని, నివారణకు పురుగుమందు పిచికారీ చేయాలని తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్‌లు ఆదివారం పరిశీలిచారు. బొబ్బిలి రోడ్డుతో పాటు మెంతిపేట ఎస్సీ కాలనీ, గాయత్రి కాలనీ, లాబా వీధుల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలపై ఆరాతీశారు. ప్రతిరోజూ పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టి, ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. అనంతరం ఆయా వార్డుల్లోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రేగిడి: మండలంలోని మునకలవలస, బాలకవివలస, వన్నలి, సోమరాజుపేట, సంకిలి గ్రామాల్లో పారిశుధ్య పనులు ఆదివారం చేపట్టారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తోణాంలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది, గిరిజన సంఘ నాయకులు

పార్వతీపురం టౌన్: కోల్‌కతాలోని ఆర్జికార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో వైద్యవిద్యార్థిని మౌమితను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, పురుషాధిక్య భావజాలం వల్లే మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. పసిపిల్లలను సైతం కామ దృష్టితో చూస్తున్న ప్రస్తుత రోజుల్లో మహిళలు ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారని చెప్పా రు. మహిళలపై దాడులు, అత్యాచారాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

శిక్షించాలి..

సాలూరు రూరల్ : మహిళా వైద్య విద్యార్థినిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ జేఏసీ మన్యం వైస్ చైర్మన్ కొండగొర్రి ఉదయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు తోణాం గ్రామంలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలు కాపాడే డాక్టర్లను దైవంతో సమానంగా చూడాలన్నారు. అలాంటి డాక్టర్లపై దాడులు, అత్యాచారాలు చేసిన వారిని కఠినగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, వెటర్నరీ డాక్టర్ ప్రభాకరరావు, తోణాం సర్పంచ్ ముచ్చల ఆదయ్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామంలో యువతీ, యువకులు పాల్గొన్నారు.

దారుణం...

పార్వతీపురం టౌన్: వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమని ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. సమాజంలో వైద్యవృత్తిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. మహిళా వైద్యురాలిని అతి కిరాతకంగా అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించే విధానంపై ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

కార్మికులను తొలగించొద్దు..

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

పార్వతీపురం టౌన్: స్కీమ్ కార్మికులను అర్ధంతరంగా తొలగించడం ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పనిచేస్తున్న చిరుద్యోగులైన ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ స్కావెంజర్స్, తదితర మహిళా స్కీమ్ వర్కర్లను కూటమి నాయకులు తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాలూరు పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్త బలగ రాధను తొలగించడానికి స్వయంగా ఓ మంత్రి రంగంలోకి దిగడం బాధాకరమన్నారు. స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ విజయనగరం జిల్లా కార్యదర్శి బుగత అశోక్, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి దుర్గారావు, ఆర్‌వీఎస్ కుమార్ పాల్గొన్నారు.

క్వారీ లైసెన్స్ రద్దు చేయాల్సిందే..

- రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘ జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి, తదితరులు

పార్వతీపురం టౌన్: చినగుడబ కొండపై అక్రమంగా నడుపుతున్న క్వారీ లైసెన్స్‌ను రద్దు చేయాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో క్వారీ లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను బలికొంటున్న క్వారీ పనులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం అమానుషమన్నారు. నిడదవోలు నుంచి వచ్చిన క్వారీ యజమాని చినగుడబ కొండపై సామ్రాజ్యాన్నే సృష్టిం చేశాడని, ప్రభుత్వ భూమి ఆక్రమించేశాడని ఆరోపించారు. ఈ క్వారీ ఫలితంగా 150 ఎకరాల్లో పంట పండడం లేదని, క్రషింగ్ సమయంలో వచ్చే దుమ్ము, ధూళి వల్ల పంట పొలాలు గట్టిపడిపోయాయని చెప్పారు. గాలి కలుషితం కావడంతో పెదగుడబ, గదబవలస ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, ఇప్పటికే ఇద్దరు చనిపోయారని తెలిపారు. క్వారీ నిర్వాహకుడు జంఝావతి కాలువ కప్పేసి రోడ్డు వేసేసినా, నాగావళి కాలువ నీరు అక్రమంగా తోడేసినా, జంఝావతి, నాగావళి కాలువలపై భారీ యంత్రాలు తిప్పేసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్వారీ లైసెన్స్ రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దుప్పాడ రాజేష్‌కుమార్, పోలురోతు చంద్రశేఖర్రావు, బెజవాడ మహేశ్వరరావు, అఖిల్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించండి..



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రెడ్డి వేణు

పార్వతీపురం టౌన్: శివ్వాం దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద దళితులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ, దళితులపై పెత్తందారులు దాడులు చేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిందితులపై చర్యలు తీసుకోకుంటే న్యాయశాఖపై ప్రజలకు నమ్మకం తగ్గిపోయే ప్రమాదముందన్నారు. ఏళ్ల తరబడి నెలకొన్న సాగుభూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు, జిల్లా కమిటీ సభ్యులు హెచ్. సింహాచలం కె.డేవిడ్, కె. శ్రీను జి.చంటి, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

సన్నాయిగూడలో అంధకారం

సీతంపేట: మండలంలోని సన్నాయిగూడ గ్రామంలో కొద్ది రోజులుగా అంధకారం నెలకొంది. వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో విష సర్పాలు, కీటకాలు బెడద ఎక్కువగా ఉంటోందని, అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి

పాలకొండ: నాగావళి ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు కోరారు. కాలువల్లో పూడికలు తీయకపోవడంతో శివారు భూములకు సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు ఐటీడీఏలో పబ్లిక్ గ్రీవెన్స్

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ అధికారులు తెలిపారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గండ్లు పూడ్చరూ..



మరమ్మతులకు గురైన కాలువ

సీతంపేట: నళినీ కృష్ణసాగరం కాలువ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నప్పటికీ కాలువ పనులు పూర్తికాకపోవడంతో సాగునీరు వృథాగా పోతోందని రైతులు అంటున్నారు. కృష్ణసాగరం కాలువ కింద సుమారు 1500 ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది. కాలువకు పలుచోట్ల పడిన గండ్లు కారణంగా సాగునీరు అందక ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాలువ మరమ్మతులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని డొంగరికిక్కువ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కంబగూడ వద్ద ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూ.50 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 1.4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ పాడి సుదర్శనరావు, నాయకులు తాడంగి లక్ష్మణరావు, బీజేపీ నాయకులు నిమ్మక సింహాచలం పాల్గొన్నారు.

రాళ్లదారి



రాళ్లు తేలిన ఎగువద్వారబందం రహదారి

సీతంపేట: మండలంలోని ఎగువద్వారబందం గ్రామ రహదారి అధ్వానంగా తయారైంది. పూర్తిగా రాళ్లుతేలిన ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు గ్రామానికి 108 అంబులెన్స్ కూడా రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆక్రమణల తొలగింపు

రాజాం సిటీ: పట్టణంలోని మాధవబజార్‌లోని కాలువపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగించారు. అక్కడి దుకాణదారులంతా కాలువపై ఇష్టారాజ్యంగా కట్టడాలు నిర్మించారు. దీంతో కాలువలోని చెత్త తీయడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కాలువలోని మురుగు అంతా రోడ్డుపై ప్రవహిస్తుండగా, అటువైపుగా వెళ్తున్న వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో సంబంధిత షాపుల యజమానులతో చర్చించి, ఆక్రమణల తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కాలువపై అక్రమంగా ఎటువంటి కట్టడాలు కట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు.

పాత వాహనాల కొనుగోలులో పత్రాలే కీలకం

- సెకండ్ హ్యాండ్ వాహనాల క్రయ, విక్రయాల్లో నిబంధనలు పాటించాలి
- సరైన పత్రాలు లేకపోతే ఇబ్బందులు తప్పవు



వాహన తనిఖీలు చేపడుతున్న అధికారులు (ఫైల్)

పాలకొండ రూరల్: ఇటీవల కాలంలో జిల్లాలో సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఎక్కడికక్కడే ఈ తరహా వాహనాలు విక్రయించే షోరూంలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలో వాహనాలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారిని కొంత మంది బురిడీ కొట్టిస్తున్నారు. సదరు వాహనాలు కొనుగోలు చేసేవారు సరైన పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సీతంపేటలో నివాసం ఉండే ఓ యువకుడు ద్విచక్రవాహనాన్ని వేరే వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడు. పోలీసులు, మోటారువెహికల్ అధికారులు సంయుక్తంగా సీతంపేట రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించే సమయంలో ఆ యువకుడి వద్ద వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు లేకపోవడంతో పోలీసులు ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. వాహనం కొనుగోలు చేసే సమయంలోనే పత్రాలు సేకరించి ఉంటే ఈ సమస్య వచ్చే వచ్చేది కాదని అధికారులు సూచించారు. వాహనాన్ని ఇతరులకు విక్రయించినట్లు సేల్ అగ్రిమెంట్, ఇతర పత్రాలన్నీ సరిగా చూసుకోకుంటే ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో పడాల్సి వస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. తాజాగా పోలీసులు ఈ-చలానా విధిస్తుండటంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత వాహనాన్ని అమ్మిన సమయంలో చిన్న బాండు పేపర్‌తో అమ్మకం గురించి ఒప్పందాలు చేసుకుని విక్రయిస్తారు. వాహనాన్ని కొన్న వ్యక్తి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసు కోకుండా అలాగే నడిపిస్తే అమ్మిన వ్యక్తికి ఈ-చలానా భారం పడుతుంది. ఈ విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వినే పరిస్థితి ఉండదు. కాగితాలను చూస్తేగాని నమ్మరు. అలాంటప్పుడు సేల్ డీడ్ అగ్రిమెంట్ కాగితాలు ఉండడం మంచిది. అమ్మిన వారేగాక కొన్న వారు కూడా చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అనుకోని పరిస్థితుల్లో వాహనం ప్రమాదానికి గురైనా చిక్కులు తప్పవు. కొనుగోలు చేసిన వారు వారం, పది రోజుల్లోపు యాజమాన్య హక్కులను మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆలస్యం చేస్తే జరిమానాలు విధించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

హక్కులు బదిలీ చేయకపోతే కష్టాలు తప్పవు

వాహనం కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా తదితర ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం చాలా ముఖ్యం. వాటితో పాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనం అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు ఎదురకావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరు వైపులా యాజమాన్య హక్కులను మార్చుకోవాలి.

కొన్న వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ఇతరుల నుంచి పాత వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా వంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవాలి. కొనుగోలు చేసిన వారు తమ పేరు, చిరునామా మార్చుకోవాలి. ఇది చాలా ముఖ్యం. వాహనంకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా కొనుగోలుదారుడే సరిగ్గా చూసుకోవాలి. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే అమ్మకం దారు, కొనుగోలు దారు ఇరువురు బాధ్యులే. కాబట్టి నిబంధనలు పాటించటం మేలు.

– జి.నవీన్‌కుమార్, సహాయ మోటారువెహికల్ అధికారి, పాలకొండ

పత్రాలు లేకుండా కొనవద్దు



సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు పత్రాలు సరిగా ఉన్నాయో, లేవో సరిచూసుకోవాలి. ట్రాఫిక్ చలానాలు లేకుండా ఉండే వాహనాలు కొనుగోలు చేయాలి. సరైన పత్రాలు లేని వాహనాలు కొనుగోలు చేస్తే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలంటే వాహనం కొనుగోలు చేసిన వెంటనే రిజిస్ట్రేషన్‌లో పేరు మార్చుకోవాలి. వాహన ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లయితే పోలీసులు ఎటువంటి కేసులు నమోదు చేయరు.

– మీసాల చంద్రమౌళి, సీఐ, పాలకొండ

మత్తుతో జీవితం చిత్తు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, యువత

రేగిడి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని, యువతీ యువకులంతా చెడువ్యసనాల బారినపడకుండా ఉండి, ఆదర్శవంతమైన జీవితం గడపాలని హితవుపలికారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అంబకండిలో త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

రేగిడి: మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రజలకు పరిచయం చేస్తూ వాటి సారాంశాన్ని వివరిస్తున్నారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మల గురించి తెలుసుకోవడం ద్వారా ధర్మస్థాపన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు పుండరీకాక్షయ్య, వెంకటరావు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, వాసు, అప్పన్న, ప్రశాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఈ-క్రాప్ నమోదు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట, మజ్జిరాముడుపేట, అప్పాపురం తదితర గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చాలా చురుగ్గా జరుగుతోంది. రైతులంతా రైతు సేవా కేంద్రాల వద్దకు చేరుకుని, తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా వారికి ఈ-క్రాప్ నమోదు ప్రయోజనాలను సిబ్బంది వివరిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే ఏదైనా ప్రకృతి విపత్తు కారణంగా పంట నష్టం జరిగితే నష్టపరిహారం వచ్చే అవకాశం ఉంటుందని సిబ్బంది తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు భక్తులతో హోమం జరిపించారు. ఈ హోమం చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.